క్షయకు కళ్లెం పడేనా!



- గతేడాది 3,077 మందికి క్షయ నిర్ధారణ
- బాధితులు 6 నుంచి 9 నెలలు మందులు వాడాల్సిందే
- నిర్లక్ష్యం చేస్తే మొండి వ్యాధిగా రూపాంతరం
- నేడు క్షయ వ్యాధి అవగాహన దినం

కర్నూలుకు చెందిన 45 ఏళ్ల మహిళ క్షయ వ్యాధితో కోలుకోలేక కన్నుమూసింది. మందులపై సరైన అవగాహన లేక మొదట్లో కాస్త బాగా అనిపించగానే మందులు మానేసింది. ఆమెకు షుగర్ కూడా ఉండటంతో వ్యాధి తిరగబెట్టి ఎండీఆర్ టీబీగా రూపాంతరం చెందింది. తర్వాత మందులు వాడినా కోలుకోలేక మృతిచెందింది. ఈ మందులు ఎలా వాడాలో వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించకపోవడం వల్లే ఆమె కన్నుమూయాల్సి వచ్చింది.

– కర్నూలు(హాస్పిటల్)



క్షయ వ్యాధిని సూచించే చిత్రం

ఎంతో మంది క్షయ వ్యాధికి మందులు వాడుతూ మధ్యలో ఆపేసి, ఆ తర్వాత మొండి టీబీతో మరణిస్తున్నారు. క్షయ బాధితులు మొదటిసారి మందుల వాడకం ప్రారంభించగానే కొందరికి కడుపులో తిప్పుతుంది. ఇందుకోసం కొందరు వైద్యులు గ్యాస్ట్రబుల్ మందులు ఇస్తారు. మరి కొందరికి తీవ్ర ఆకలి అవుతుంది. ఇంకొందరికి రెండు నెలలు మందులు వాడగానే ఆరోగ్యం కుదుటపడుతుండటంతో బాగైందని భావించి మందుల ప్రభావానికి భయపడి మానేస్తున్నారు. కానీ మందులు మధ్యలో ఆపకూడదని, కచ్చితంగా 6 నుంచి 8 నెలలు వాడాలని చెప్పేవారు లేరు. గతంలో లాగా డాట్స్ విధానంలో ఇచ్చే మందుల పద్ధతి కూడా ఇప్పుడు లేకపోవడంతో రోగుల్లో తీవ్రత పెరిగిపోతోంది. నేడు వరల్డ్ టీబీ డే (ప్రపంచ క్షయ వ్యాధి అవగాహన దినం) సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ప్రతి 2 లక్షల నుంచి 2.5 లక్షల జనాభాకు ఒక టీబీ యూనిట్ చొప్పున 9 యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఇందులో ఒక సీనియర్ టీబీ సూపర్‌వైజర్, సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తున్నారు. రోగులను పర్యవేక్షించేందుకు ప్రతి సూపర్‌వైజర్‌కు ఒక మోటార్ సైకిల్ ఇచ్చారు. దీంతో పాటు ప్రతి పీహెచ్‌సీలో ఎక్స్‌రే యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా క్షయ నిర్ధారణ చేయవచ్చు. గతేడాది 78,368 మందికి పరీక్షలు చేయగా 3,077 మందికి క్షయ నిర్ధారణ అయ్యింది. గత కేసులతో కలుపుకొని మొత్తం 4,571 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు 6 నుంచి 8 నెలల పాటు ఉచితంగా అందిస్తారు. గతేడాది క్షయ నుంచి కోలుకోలేక 104 మంది మరణించారు.

వ్యాధినిర్ధారణ ఇలా !

రెండు వారాలకు మించి దగ్గ, సాయంత్రం వేళల్లో జ్వరం, దగ్గితే గళ్ల పడటం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం వంటి లక్షణాలుంటే క్షయగా అనుమానించి సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలి. రోగి గళ్లను వైద్య సిబ్బంది సేకరించి మైక్రోస్కోప్, ట్రూనాట్, సీబీనాట్ మిషన్ల ద్వారా నిర్ధారిస్తారు.

పెరుగుతున్న ఎండీఆర్‌టీబీ కేసులు

క్షయవ్యాధిలో మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ టీబీ (ఎండీఆర్‌టీబీ) కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. క్షయ మందులపై అవగాహన లేక చాలా మంది కోర్సు మధ్యలోనే మానేస్తున్నారు. దీనివల్ల వ్యాధి తిరగబెట్టి మరింత మొండిగా తయారవుతోంది. అప్పుడు సాధారణ టీబీ మందులు పనిచేయవు. వారికి ఖరీదైన ఎండీఆర్ టీబీ మందులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటి ఖరీదు రూ.2 లక్షల దాకా ఉంటుంది. ఈ మందులకు కూడా లొంగకపోతే బెడాక్విలిన్ అనే రూ.18 లక్షల విలువైన 11 నెలల కోర్సు మందును ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎండీఆర్ టీబీ రోగులు 135 మంది ఉండగా, బెడాక్విలిన్ మందులు వాడే వారు 52 మంది ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత మందులతో పాటు రోగి పోషకాహారం కోసం నెలకు రూ.వెయ్యి అందిస్తున్నారు.

గత ఐదేళ్లుగా టీబీ కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైన టీబీ కేసులు	ఎండీఆర్ టీబీ కేసులు	టీబీ, హెచ్ఐవీ కేసులు
2020	1,974	116	152
2021	2,668	167	183
2022	2,700	164	156
2023	2,651	79	103
2024	3,077	135	113

నిక్షయ్ మిత్ర ద్వారా సరుకులు

నిక్షయ్ మిత్ర ద్వారా కో–ఆపరేటివ్, కార్పొరేట్, ప్రజాప్రతినిధులు, దాతల ద్వారా క్షయ రోగులకు అవసరమైన పోషకాహార కిట్లను అందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 129 సంస్థలు రిజిస్టర్ కాగా 2,117 మంది క్షయ రోగులను దత్తత తీసుకుని 12,045 పోషకాహార ప్యాకెట్లను అందజేశారు.

నేడు అవగాహన సదస్సు

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులో ఈ నెల 24వ తేదీన ర్యాలీ నిర్వహించనున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. క్షయ వ్యాధిపై వైద్య, ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు.

క్షయను తగ్గించడమే లక్ష్యం



జిల్లాలో ప్రస్తుతం ప్రతి 3 వేల మందికి పరీక్ష చేయగా 170 దాకా కేసులు బయటపడుతున్నాయి. ఈ సంఖ్యను 50లోపు తగ్గించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సోకకుండా చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధిసోకిన వారి ఇంట్లో అందరికీ టీబీ ప్రివెంటివ్ థెరపీ కింద ఆరు నెలల పాటు మందులు ఉచితంగా ఇస్తున్నాం. ఇటీవల పెద్దవారికి కూడా వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది.

–డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా క్షయ నియంత్రణాధికారి, కర్నూలు

క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లోని కొండారెడ్డి బురుజు పార్కులో తైక్వాండో క్రీడాకారులకు బెల్టు పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన క్రీడాకారులకు తైక్వాండో క్రీడా పరికరాలు, టోపీలు, పండ్లు ప్రతిభ చాటిన క్రీడాకారులకు కలర్ బెల్టులు ప్రదానం చేశారు. తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుండగులను అరెస్టు చేయాలి



నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): తూర్పుగోదావరి జిల్లా దూబచర్లలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మతోన్మాద ప్రభుత్వ పాలనలో అంబేడ్కర్‌కు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. స్వయంగా హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్ జపం ఎందుకు.. అంటూ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణ, చక్రపాణి, వెంకటేశ్వర్లు, మదన్‌గోపాల్ పాల్గొన్నారు.

శ్రీశైలం యాత్రికులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): గ్రేటర్ కర్నూలు రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్, కర్నూలు రోటరీ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వెళ్లే భక్తులకు ఆదివారం కొత్త అయ్యప్ప స్వామి గుడి వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చిన్మయానంద మిషన్ మాతాజీ, 17వ వార్డు కార్పొరేటర్ పద్మలత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శిరీష, ఉష, శారదా దేవి, వసుంధర దేవి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి శతాబ్ది బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని వన్‌టౌన్ సమీపంలో 200 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీరామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలను ఏప్రిల్ 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి తెలిపారు. ఆదివారం షరాఫ్ బజార్‌లోని ప్రైవేట్ భవన్‌లో బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆలయ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 16న సీతారాముల కల్యాణం, సాయంత్రం దివ్యమంగళ రథోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అర్చకులు మాళిగి హనుమేషాచార్య పాల్గొన్నారు.

తల్లిపై తనయుడి దాడి

ఆదోని అర్బన్: పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన ఉదయ్‌కుమార్ అనే వ్యక్తి తన తల్లి లక్ష్మిని కొట్టడంతో ఆమె ఆదివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసిందని త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కార్వన్‌పేటలోని ఉదయ్‌కుమార్ ఇంటికి వెళ్లి స్టేషన్‌కు పిలుచుకుని రావడానికి నరసింహులు అనే కానిస్టేబుల్‌ను పంపడం జరిగిందన్నారు. కానిస్టేబుల్‌ను కూడా ఉదయ్‌కుమార్ కొట్టాడని తెలిపారు. తల్లిని కొట్టడం, విధులకు ఆటంకం కలిగించి కానిస్టేబుల్‌పై చేయి చేసుకోవడంపై ఉదయ్‌కుమార్‌పై రెండు కేసులను నమోదు చేశామని సీఐ తెలిపారు.

దేవరగట్టులో పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళహారతి, అర్చనలతో పాటు రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండలంతో పాటు ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు నగరపాలకలో ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో 50 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో నగరంలోని ఇంటి స్థలాల లబ్ధిదారుల కన్వీనర్లతో సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందించాలన్నారు. కర్నూలు నగరంలో ఇళ్ల స్థలాల కోసం 35 వేలకు పైగా లబ్ధిదారులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నాగరాజు, బీసన్న పాల్గొన్నారు.

ముగిసిన వైద్య విజ్ఞాన సదస్సు



సదస్సులో పాల్గొన్న వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): చిన్నపిల్లల్లో ఒక్కోసారి అత్యవసర పరిస్థితులు ఏర్పడతాయని, అలాంటి సమయంలో అత్యాధునిక చికిత్స చేయాల్సి ఉంటుందని సీనియర్ వైద్యనిపుణులు తెలిపారు. పిల్లల్లో ఎక్మో, సీఆర్‌ఆర్‌టీ (కంటిన్యూవ్ రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ) లాంటి చికిత్సలు అందించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి విధానాలపై రాయలసీమ వ్యాప్తంగా ఉన్న పలువురు చిన్నపిల్లల వైద్య నిపుణుల కోసం కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో ఆదివారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఎక్మో, సీఆర్‌ఆర్‌టీ వంటి పలు రకాల చికిత్స విధానాలపై సమగ్రంగా వివరించారు. అత్యాధునిక పరికరాలు, అత్యవసర చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. ఐఏపీ కర్నూలు అధ్యక్షుడు డాక్టర్ విజయానందబాబు, కార్యదర్శి వి.వీరరత్నాకర్‌రెడ్డి, కోశాధికారి జె.ఎల్.ప్రకాష్ ఆనంద్, సీనియర్ వైద్యులు, సీఓఓ సునీల్ సేపూరి పాల్గొన్నారు.

నేటి తరం నటులకు స్ఫూర్తి వెంకట నరసునాయుడు



నటులను సన్మానిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు(సెంట్రల్): నేటి తరం నటులకు స్ఫూర్తి, దివంగత మహానటుడు వెల్దుర్తి వెంకట నరసునాయుడు అని టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం వెంకట నరసునాయుడు 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక టీజీవీ కళా క్షేత్రంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. వెంకట నరసునాయుడు తన నటనతో, మధురమైన గాత్రంతో అలనాటి ఆంధ్ర శ్రోతలను ఉర్రూతలూగించారని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్.చంద్రన్న మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ధూపం తిరుమల తేజ, ధూపం రామక్రిష్ణ, బొబ్బిలి నాయుడును ఘనంగా సన్మానించి పారితోషికం అందించారు. నరసు నాయుడు మనుమడు వెంకటనాయుడు, పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, ధూపం రామక్రిష్ణ, బాల వెంకటేశ్వర్లు, వీవీ రమణారెడ్డి, హనుమంతరావుచౌదరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామాంజనేయ యుద్ధం నాటకాన్ని ప్రదర్శించారు. నాటకంలోని ప్రతి పద్యానికి ఆడిటోరియం కరతాల ధ్వనులతో మార్మోగింది.

అమర వీరులకు ఘన నివాళి



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు




ముజఫర్ నగర్‌లో నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): భగత్‌సింగ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, కె.జగన్నాథం పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్ భవన్‌లో భగత్‌సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ.. అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం

- ముజఫర్ నగర్‌లో డీవైఎఫ్ఐ న్యూసిటీ కార్యదర్శి హుస్సేన్‌బాషా, యూటీఎఫ్ జిల్లా నాయకులు హేమంత్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- రాయలసీమ యూనివర్సిటీ, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీల్లో ఆదివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభలను నిర్వహించారు.
- ఏఐడీఎస్‌ఓ, ఏఐడీవైఓ, ఏఐఎంఎస్ఎస్ ఆధ్వర్యంలో పాత కంట్రోల్ రూమ్ సర్కిల్‌లో అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

కర్నూలు(సెంట్రల్): దేశం కోసం అతి చిన్న వయస్సులో ప్రాణ త్యాగం చేసిన సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తిగా సమ సమాజం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ధర్నా చౌక్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఏఐడీవైఓ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న యువత



సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

రూపాల సంగమేశ్వరుడి సేవలో ఎస్పీ దంపతులు



ఎస్పీ దంపతులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): నగర శివారులోని జగన్నాథగట్టుపై వెలసిన ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామిని ఆదివారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, సతీమణి కర్నూలు రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.గురెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. పూజారి సురేష్ శర్మ వారిచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తాలుకా అర్బన్ సీఐ శ్రీధర్ వెంట ఉన్నారు.

చెత్త దిబ్బలను తొలగించాలి

కల్లూరు: గోవర్ధన్ నగర్ రైతు బజార్ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న చెత్త దిబ్బలను తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శి సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ గోవర్ధన్ నగర్‌లోని రైతు బజార్‌కు ఎదురుగా ఉన్న రోడ్డు వెంట ఇందిరమ్మ కాలనీ, శ్రీనివాస నగర్, ఉమామహేశ్వరి నగర్, ఫరూక్ నగర్ తదితర కాలనీలకు ఇదే రోడ్డు వెంట వెళ్లాలన్నారు. వర్షకాలంలో ఈ రోడ్డు బురదమయంగా మారుతుందన్నారు. దీంతో ఆయా కాలనీలకు చెందని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల స్పందించి నూతన రోడ్డును నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆనంద్, రామాంజనేయులు, బీసన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కల్లూరు: నగరంలోని బి.టి.ఆర్ నగర్‌లో మంచానికే పరిమితమైన మహబూబ్ బాషాకు సీపీఎం 19, 20వ వార్డుల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారికి ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం నాయకులు నరసింహులు, రాధాకృష్ణ కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసుల, శీను, సుబ్బరాయుడు, సీతమ్మ, పెద్ద మాలిక్, జయన్న, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ దగ్గర ఆదివారం సాయంత్రం లారీ–బైక్ ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోకి వెళ్తున్న లారీ లోపలి గేట్ వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక భాగం ముగతికి వెళ్తున్న రహిమాన్ అనే వ్యక్తి బైక్‌కు తగిలింది. దీంతో రహిమాన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ బోయ రామకృష్ణ తెలిపారు.

డ్వామాలో పలువురికి స్థానచలనం

- 'కూటమి' నేతల సిఫార్సులకు ప్రాధాన్యం



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా)లో పలువురికి స్థానచలనం కలిగింది. కంప్యూటర్ ఆపరేటర్లు, సాంకేతిక సహాయకులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, ఏపీవోలు, ఏపీడీలు దాదాపు 100 మందిని ఆదివారం కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేశారు. ఒకేచోట మూడేళ్ల పైబడిన వారితో పాటు రిక్వెస్ట్‌పై బదిలీలు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేలు, జనసేన నాయకుల సిఫార్సుల మేరకే బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. ఏపీడీల్లో ముగ్గురికి బదిలీలు జరిగాయి. ఆలూరు క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న పద్మావతిని కర్నూలు క్లస్టర్‌కు, కర్నూలు క్లస్టర్‌లో పనిచేస్తున్న లక్ష్మన్నను పత్తికొండ క్లస్టర్‌కు, పత్తికొండ క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న పక్కీరప్పను ఆలూరు క్లస్టర్ ఏపీడీలు బదిలీ చేశారు. నలుగురు సీఎల్‌ఆర్‌సీలు, ఆరు మంది ఏపీవోలు, ఏడుగురు ఈసీలు, 52 మంది సాంకేతిక సహాయకులు, 45 కంప్యూటర్ ఆపరేటర్లు/అకౌంటెంట్లు, ఎంటీసీలు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు ఒక్కొక్కరు ప్రకారం బదిలీ అయ్యారు. కౌన్సిలింగ్‌లో అదనపు పీడీ మాధవీలత, ఏవో విజయలక్ష్మి, హెచ్‌ఆర్ మేనేజర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్షల తనిఖీ



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న వయోజన విద్య అధికారులు

ఓర్వకల్లు: వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా పొదుపు మహిళలకు నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలను వయోజన విద్య డీడీ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఆదివారం మండలంలోని హుసేనాపురం గ్రామం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పరీక్షలను చంద్రశేఖర్‌తో పాటు ఏపీఎం వెంకటరామిరెడ్డి, సూపర్‌వైజర్ నెమలయ్య కేంద్రాన్ని సందర్శించి, మహిళలు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు.

వ్యర్థాలను తొలగించాలి



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో మురుగు కాల్వల నుంచి తీసిన పూడిక, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, ఎన్ఆర్ పేట కాలనీలలో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి రెండు వారాలకోసారి తప్పనిసరిగా ప్రతి వీధిలోని డ్రైనేజీల్లో పూడికను తొలగించాలని, పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు అపరిశుభ్రంగా ఉండకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. మురుగు కాల్వలపై ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం



ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): చెడుపై యుద్ధం ప్రకటించి ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన ప్రవక్త బోధనలు అందరికీ ఉపయోగం అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని 11వ వార్డు శాలుమియ్య మసీదులో ఎస్.టీ.బాబు ఆహ్వానం మేరకు ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, పార్టీ నగర మైనార్టీ నాయకులు పత్తాబాషా, చేనేత విభాగం అధ్యక్షుడు నీలకంటూ, గ్యాస్ శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

పత్తికొండ రూరల్: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 25వ తేదీన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిఅధికారి ఆనంద్‌రాజ్‌కుమార్, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధురి ఆదివారం తెలిపారు. 18–30 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పాసైన నిరుద్యోగ యువతీ,యువకులు బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ 9603303354 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.